
# నిద్ర




డా॥ వి. చంద్రశేఖరరావు



## ఒకటి

ఆ సాయంకాలం అపార్ట్‌మెంటు బయట, కుండీల్లోని పూలమొక్కలు, ఆకుపచ్చని జ్ఞాపకాల్ని శ్వాసిస్తూ, పరిమళాల పాటలతో, వానమబ్బుల్ని ఆహ్వానిస్తున్నాయి. అంతటా వాన. ఉల్లాసభరితమైన వాన. స్కూలు నుంచి వస్తున్న జయంతుడి మీద వాన. ఆఫీసు నుంచి ఆలస్యంగా వస్తున్న సుందరం పై వాన. వానకంటే ముందే ఆఫీసు నుంచి వచ్చిన పూర్ణ. వానమబ్బుల చల్లగాలికి, పరుపుపై వాలిపోయి, అట్లాగే నిద్రపోయింది. స్కూలు నుంచి వచ్చిన జయంతుడికి ఆకలిగా ఉంది. అయినా అమ్మను లేపకుండా, గడపలో కూర్చుని వానతో సంభాషిస్తున్నాడు. రోడ్లపై వాన చేస్తున్న చప్పుళ్ళు వినిపిస్తున్నాయి. పేవ్‌మెంట్లపై నల్లని గొడుగులు లేదా సగం సగం తడిచి హడావుడిగా పరిగెత్తే మనుషులు;

ఏడుగంటలకు సుందరం ఇంట్లోకి వచ్చాడు. తడిచి వున్నాడు. తడవటం ఎంజాయ్ చేస్తున్నవాడిలా, సన్నగా ఈల వేసుకుంటూ తల తుడుచుకుంటున్నాడు. ఎనిమిదయింది. ఇంటిమధ్యలో రంగు రంగుల బెడ్ (దాన్ని వాళ్ళు మమ్మీస్ హెవెన్ అని పిలుస్తారు), దాని పై పూర్ణ యింకా నిద్రపోతుంది. సుందరం వంటగదిలో ఉన్నాడు. అమ్మను నిద్ర లేపు అని సుందరం, జయంతుడికి సైగ చేశాడు.

జయంతుడు, వాళ్ళమ్మ దగ్గరకు వెళ్ళాడు. ఆమె భుజాల్ని పట్టుకొని, మెల్లగా ఊపాడు. ''అమ్మా,'' అని మృదువుగా పిలిచాడు. ఆమె ముఖం మనోహరంగా ఉంది. అలసటనంతా మాయం చేసి నిద్ర, ఆమెనో దేవతామూర్తిగా మార్చింది. ''మీల్సు రడీ,'' అని కేక వేశాడు సుందరం. చాలాసేపు కబుర్లు చెప్పుకుంటూ అన్నం తిన్నారు వాళ్ళు. పది గంటలకు మళ్ళీ నిద్రకు ఉపక్రమించారు. ముగ్గురికి ఆ బెడ్ ఇరుకు అయినా, జయంతుడు వాళ్ళ మధ్యకు దూరాడు.

సుందరం ఆఫీసు సంగతులేవో చెబుతున్నాడు. పూర్ణ జయంతుడి జుట్టు నిమురుతూ, పెద్దగా చప్పుడు లేని పాటను హమ్ చేస్తుండగా, క్రమంగా వాళ్ళు నిద్రలోకి వెళ్ళిపోయారు.

ఉదయం ఆమె ముందుగా నిద్ర లేచింది. కాఫీ చేసుకొని, గుమ్మంలో కూర్చుని, ఆకాశం దారి నుంచి బద్ధకంగా వస్తున్న ఎండ పొద్దును చూస్తూ కూర్చుంది. పేపర్ కోసం, పాలకోసం సుందరం బయటకు వెళ్ళాడు. సూర్యకాంతి నిశ్శబ్దంగా ఉంది. కుండీల్లోని పూలమొక్కలకు వేలాడుతున్న నిన్నటి వాన చినుకులపై తొలిపొద్దు ఎండ మిలమిలలాడుతుంది. పూర్ణ కప్పులోని కాఫీ ఇంకా అయిపోలేదు. మంద్రమైన ఉదయపు గాలి, వెండి వెలుగులతో కలిసి, జయంతుడి పై వాలి, వాడికి గిలిగింతలు పెట్టి నిద్ర లేపాయి.

పూర్ణ ఇంకా అరమోడ్పు కళ్ళతో కాఫీని ఆస్వాదిస్తూనే వుంది. వాడి కోసం కలిపిన హార్లిక్స్ కప్పుతో వాడూ, వాళ్ళమ్మ పక్కన కూర్చుని, పూర్ణ కళ్ళు తెరుచుకునే కలలు కంటుంది. ఒక ప్రయాణాన్ని కలగంటుంది. సిటీ దాటి, అపార్టుమెంటు దాటి, ఉదయాన్ని, ఇవాళ్టినీ దాటి; తన చిన్ననాటి హైస్కూలు రోజుల్లోకి ప్రయాణించింది. నూగు జీడీలు, బొరుగు ముద్దలు, అరిసెలు, మెత్తటి జున్ను; జున్ను తాలూకు మనోహరమైన రుచిలోకి ప్రయాణించింది.

జయంతుడికి, జున్ను వాసన ముక్కులకు తగిలింది. పూర్ణ జున్ను తింటున్న అనుభూతిని కలగంటుంది. పెరట్లోని లేగదూడ అరుపును కలగంటుంది. దాని మెడలోని గంటల చప్పుడులోకి ప్రయాణిస్తుంది. జయంతుడు, ఆమె భుజాన్ని పట్టుకొని ఊపాడు. పూర్ణ వాడివైపు చూసి, సన్నగా నవ్వి, మళ్ళీ తన ప్రయాణాన్ని కొనసాగించింది.

పూర్ణ యింకా పల్లెటూరిలోని, వాళ్ళ యింట్లోనే ఉంది. ఇంటి మధ్యనున్న పందిరి మంచం, దాని పైని విశాలమైన పరుపు, పరుపు పై వాళ్ళ నాన్న, చెన్నపట్నం నుంచి తెచ్చిన మెత్తని సిల్కు దుప్పటి స్పర్శను అనుభవిస్తుంది. పరుపు పై పడుకొని, వాళ్ళమ్మ తినిపిస్తున్న





దోసగింజల పచ్చడితో కలిపిన అన్నం ముద్దలు తింటూ; పూర్ణకు తన కాళ్ళు వసంతరుతువులుగా మారినట్లు తన కాళ్ళకు, రంగు రంగుల పూలు మొలిచినట్లు; పూర్ణ యింకా ప్రయాణిస్తుంది. పల్లెటూరులోని, వాళ్ళ పెంకుటింటిలోంచి, లేగదూడలు నివసించే పెరటిలోంచి, పొలం గట్లలోంచి, తూనీగలు ముసిరే, పసుపుపచ్చని చేమంతి తోటల్లోంచి, మామిడితోపుల్లోంచి, రేగుపళ్ళ పొదల్లోంచి, ఊరి చివరి కోవెల్లోంచి, కోవెల పక్కనున్న శ్రీనివాసరావు మాష్టారి బడి నుంచి- ఆమె ప్రయాణం కొనసాగుతుంది. ఆమె ప్రయాణపు ముచ్చట్లన్నీ జయంతుడు ఊ కొడుతూ వింటున్నాడు. వాకిలిపై కూర్చుని కలలు గంటున్న పూర్ణను చూసి, సుందరం జెలస్ ఫీలయ్యాడు. ముప్ఫయ్యేళ్ళ వయసులోకూడా, ఆమె బాల్యం, తల్లి, పల్లెటూరు, ఆమెను వదలి పోనందుకు.

వాళ్ళ యింటి నుంచి తెచ్చుకున్న బూరుగుదూది పరుపు (వాళ్ళ నాన్న ఆమె కోసం ప్రత్యేకంగా చేయించింది), ఆ పరుపు ఏదో మహిమలు గల పరుపు అనిపిస్తుంది సుందరానికి. దాన్ని ముట్టుకోగానే, నిద్ర పొంగుకు వస్తుంది. ఆ నిద్ర నిండా సాహసయాత్ర ల్లాంటి కలలు. బాల్యపు కేరింతలలాంటి కలలు.

ఆమె భుజాన్ని పట్టుకొని ఊపాడు జయంతుడు. "మైనం పాడులోనో, బసవన్నపాలెంలోనో ఉండి ఉంటుంది. ఇప్పుడిప్పుడే వెనక్కు రాదు," అన్నాడు సుందరం.

ఆమె సన్నగా నవ్వుకుంటూ గడపలోంచి లేచింది. కుండీల్లోని పూలమొక్కలు అప్పటికే నిద్ర లేచి, సూర్యకిరణాల్తో సంభాషి స్తున్నాయి.

నిద్ర తాలూకు బద్ధకాన్ని, కలలమత్తును వదిలించుకొని, ఆ ఇల్లు నిజంగా నిద్ర లేచింది. వాళ్ళ రోజు మొదలైంది.

**రెండు**

వాళ్ళు సరిగ్గా నిద్రపోలేకపోతున్నారు. రాత్రుళ్ళు కాపలా కాసే దీపాల్ల వాళ్ళ కళ్ళు తెరుచుకునే ఉంటున్నాయి. బహుశా, ఈ పరుపు

పాతదై, గట్టిపడి, శరీరాన్ని బాధిస్తూ, అంటాడు సుందరం. పరుపుకేం, నాన్న ప్రత్యేకంగా కుట్టించింది అంటుంది పూర్ణ.

ఉదయం నాలుగు గంటలకే జయంతుడు, ఎంసెట్ కోచింగ్ అంటూ వెళ్ళిపోతాడు. ఉదయం నిద్ర లేవగానే, నిద్ర గురించి, నిద్ర పట్టకపోవటం గురించి, చాలాసేపు మాట్లాడుకుంటారు సుందరం, పూర్ణ. గంట ముందే ఆఫీసుకు బయలుదేరుతాడు సుందరం, టిఫిన్ ఆఫీసులో చేస్తానంటూ. ఎర్రజీరల కళ్ళతో బద్ధకంగా, పూర్ణ కూడా బయలుదేరుతుంది. బస్సులన్నీ నిండి ఉంటాయి. ఎవడో దయగా ముందుకు తోస్తే, బస్సు మధ్యలో త్రిశంకువులా వేలాడుతూ; బస్సు లోనూ నిద్ర గురించే వాళ్ళ ఆలోచనలు. రాత్రికి ఏ గదిలో మంచం వేస్తే నిద్ర పడుతుందో అని ఆలోచిస్తుంటారు. బస్సులో వెళుతుండగా చౌరస్తాల దగ్గర, ఎవడో గుడ్డివాడు మనోహరమైన వేణుగానం విని పిస్తూ ఉంటాడు. అందరూ మంత్రముగ్ధులై ఆ వైపుకు చూస్తారు. కాసేపు సమస్తాన్ని మరిచి వేణుగానపు హాయిలో తడిసిపోతారు. వాళ్ళిద్దరు మాత్రం చెవుల్ని మూసివేసి, ఎందుకీ సంగీతాలు, పాటలు, నిద్రకు ఉపయోగపడని, ఏ అనుభూతైనా, ఎందుకు దండుగ, అని తీర్మానించుకున్నట్లుగా ఉంటారు.

సుందరం ఒక ప్రైవేటు స్కూల్లో టీచరుగా పనిచేస్తున్నాడు. క్లాసులు లేని సమయంలో స్టాఫ్‌రూమ్‌లో కూర్చుని, కళ్ళు బరువై, నిద్ర వస్తున్నట్లు అనిపించి, చుట్టుపక్కలకు చూస్తారు. తోటి టీచర్లు అతని వైపే చూస్తున్నట్లు అనిపిస్తుంది. క్లాస్‌రూమ్‌లో పాఠం చెబు తున్నప్పుడు, వెంటాడుతున్న నిద్ర, సమయం యిదే అనుకొని, కళ్ళను ఆవహిస్తుంది. కుర్చీలో చేరగిలబడి, పిల్లలు పెద్దగా నవ్వుతుంటారు.

సాయంకాలం ఇంటికి వెళ్ళే సమయం. ఏడుగంటల దాకా బస్సు దొరకదు. బస్సులో ఎక్కినాక వాన మొదలవుతుంది. రోడ్లన్నీ నీళ్ళతో స్నానిస్తూ ఉంటాయి. ఎక్కడ బస్సులక్కడే. సుదీర్ఘమైన ట్రాఫిక్‌జామ్. బస్సులు కదలవు. సమస్తం స్తంభించిపోయినట్లుగా; బస్సు నత్తలాగా, అడుగులు వేసుకుంటూ పదిగంటలకు సుందరం

ఇంటికి చేరతాడు. బయటంతా వెన్నెల. సమస్తమూ మిలమిల మెరుస్తూ. వాన మిగిల్చిన విధ్వంసం అన్నివైపులా. రోడ్లపైని నీరు ఇళ్ళలోకి ప్రవహిస్తూ. పదిన్నరకు పూర్ణ వచ్చింది. అపార్టుమెంటులోకి నీళ్ళు వచ్చాయి. ఆ నీళ్ళ మధ్యనే కూర్చుని జయంతుడు ఎంసెట్ పాఠాలు చదువుకుంటున్నాడు. నీళ్లు తోడివేసే కార్యక్రమం గంటసేపు పట్టింది. రెండు మెతుకులు అన్నం తిని, నిద్రకు ఉపక్రమించారు వాళ్ళు. కిటికీల్లోంచి జారిన వానజల్లుకు పరుపు తడిసి, బిగుసుకు పోయి; కంతులు కట్టి, ముడుతలుపడి, ఉబ్బెత్తుగా పైకి లేచి, అది పరుపులాగా కాకుండా, పురాతనమైన సమాధిలాగా ఉంది. దాన్ని యధాస్థితికి తెచ్చే ప్రయత్నం ఏమీ చెయ్యకుండా, పొడిగా ఉన్న రగ్గులను కప్పి నిద్రకు ఉపక్రమించారు. జయంతుడు ఇప్పుడు వాళ్ళతో పడుకోవటం లేదు. వాడసలు ఇప్పుడు నిద్రను మరిచి పోయాడు. ఒక గంటో, రెండు గంటలో పడుకుంటాడు. నిద్ర పట్టగానే ఉలిక్కిపడి లేచి, ఎంసెట్ పుస్తకాలు తెరిచి, చదువు మొదలు పెడతాడు.

వర్షం కురిసిన, ఆ రాత్రి, చల్లటి గాలి. ఎప్పటివో మధురమైన సంగతుల్లా వీస్తుండగా, వాళ్ళిద్దరు, రెండు దాటినా నిద్రరాక అవస్థలు పడుతున్నారు. పరుపు, ఆ క్షణంలో భగవంతుడి శాపంలాగా కనబ డింది. ఒక చారిత్రక అవశేషంలా తోచింది. వాళ్ళ శరీరాల్ని మహా మాయలాగా కౌగలించుకొని, ఆ పరుపు పై వాళ్ళు రెస్ట్‌లెస్‌గా అటూ ఇటూ దొర్లుతున్నారు. పక్క అపార్టుమెంట్ల నుంచి పెద్ద పెద్ద చప్పుళ్ళు వినిపిస్తున్నాయి. సామాన్లు సర్దుతూ, నీళ్ళను తోడివేస్తూ, పిల్లల అరుపులు, పెద్దవాళ్ళ హడావుడి- వీధిలో పెద్దపెద్ద ఫ్లడ్‌లైట్లు, టి.వి. ఛానళ్ళవాళ్ళు, వానలు పడ్డప్పటి రోడ్లు, అపార్టుమెంట్లు, ఎట్లా ఉంటాయో రికార్డు చేస్తున్నారు. ఈ అరుపులు, కేకలు, అలజడులు ముగిసినాక ఎప్పుడో నాలుగు గంటలకు నిద్రపట్టింది వాళ్ళకు.

తెల్లవారింది. వాళ్ళు కళ్ళు తెరిచారు. నిద్రపోయాము అను కున్నారుగానీ, పూర్తిగా తృప్తిగా నిద్ర పట్టలేదు. బయట సూర్యుడు,

తన వేడి చూపులతో తడిచిన ప్రపంచాన్ని ఆరబెడుతున్నాడు. ఇంటి తలుపులు, కిటికీలు తెరిచి, ఎండను లోపలికి ఆహ్వానించారు. తడిచిన పరుపును తెచ్చి ఎండలో ఆరబెట్టారు. తడిచి, పైకి ఉబికి, పక్క అపార్టుమెంట్ల వాళ్ళకు అదో వింత అయింది. కొందరు అది రబ్బరుతో చేసింది అనీ, కొందరు థర్మాకోల్‌తో చేసింది అనీ చర్చించు కోసాగారు. అనాకారి అయిన బిడ్డను, నలుగురు అవమానించి నప్పుడు కలిగే కోపం, వాళ్ళకు వచ్చింది. పరుపును తెచ్చి మళ్ళీ లోపల వేశారు.

ఆ నెలలో కొన్ని అప్రియమైన విషయాలు జరిగాయి వాళ్ళ జీవితంలో. జయంతుడికి ఎంసెట్‌లో మంచి ర్యాంకు రాలేదు. ఆఫీసులో కళ్ళు తిరిగి పడిపోయిన సుందరానికి హాస్పిటల్‌లో పరీక్షలు చేసి హై బి.పి. అని తేల్చారు. పూర్ణ, సేల్సులేడీగా పనిచేసే షాపులో షార్ట్ సర్క్యూట్ అయి, షాపు అంతా తగలబడిపోయింది. పూర్ణ ఉద్యోగం లేనిదయింది.

నిద్ర పట్టకపోవడానికి వాళ్ళకు ఒక కారణం దొరికింది. ఇద్దరూ పరుపు పై రాత్రంతా మేలుకొని, తలగడ అటువైపు, ఇటువైపు మార్చి, మంచాన్ని ఆ చివరకు, ఈ చివరకు ఈడ్చి; నిద్రపట్టకపోవడం గురించి గంటలు గంటలు చర్చించుకుంటూ; నిద్ర, ఒక తాత్విక సమస్య అయ్యింది. నిద్రపట్టడం కోసం యోగ, మెడిటేషన్ లాంటి ప్రక్రియలు ట్రై చెయ్యాలనుకున్నారు. స్లీపింగ్ పిల్స్ కొని తెచ్చుకొన్నారు.

స్లీపింగ్ పిల్స్ వేసుకొన్న రాత్రి ఒక వింత జరిగింది. అంతకు ముందు పూర్ణ, పరుపు మళ్ళీ ఏకించి, కొత్త కవర్ వేసి, సరికొత్త దుప్పటి పరిచి, ఆ రాత్రి పరుపు ఇంటి మధ్యలో ఒక వ్యవస్థలాగా, ఒక సంస్థలాగా తోచింది వాళ్ళకు. కాస్త మత్తుగా, నిద్ర వస్తుంది అనుకొంటున్న సమయానికి, ఆ వింత జరిగింది. పరుపు వాళ్ళతో సంభాషించటం మొదలుపెట్టింది. అది వాళ్ళకు కౌన్సిలింగ్ చేస్తుంది. ముఖ్యంగా పూర్ణ నుద్దేశించి; ఆమె బాల్యం, పల్లెటూరు, పెరటిలోని లేగదూడలు, ఎన్నెన్నో మధురమైన సంగతులు చెప్పి, ఇవిగో

పూలతోటలపై పరిమళాలు, ఇదుగో ఇక్కడ అమ్మ భోగిపండుగనాడు తలంటి, కురులకు సాంబ్రాణి పొగ పెడుతూ; ఇది దోర రేగుపండు రుచి, ఇవి తూనీగలు, తుమ్మెదలు, చెట్టు పై నుంచి అరిచే కోయిలలు; ఇది, నువ్వు జ్వరం పడి మంచంపై పడుకుంటే, నాన్న నీ కాళ్ళు వత్తుతూ; ఒక్కొక్క దృశ్యాన్ని గుర్తు చేస్తూ. మంత్రపు పొగ ఏదో వాళ్ళ చుట్టూ అలుముకొన్నట్లు, వాళ్ళకు గాఢనిద్ర పట్టింది. తల్లిని అల్లుకొని పడుకొన్న శిశువుల్లా, ఆ పరుపును కరుచుకొని నిద్రపోయారు. ఆవాల్టి నుంచి పరుపు వాళ్ళకు ఆత్మీయ వ్యక్తి అయ్యింది. పరుపు వాళ్ళ భద్రకవచం అయింది. భగవంతుడిలాగా, కమ్యూనిజంలాగా అది వాళ్ళకొక గంభీరమైన భావన అయ్యింది.

పరుపు ఆ ఇంట్లో నాలుగో మనిషి అయ్యింది. దానికో మూర్త భావనను ఆపాదించారు వాళ్ళు. ముఖ్యంగా పూర్ణ పగలంతా పరుపు పైనే పడుకొని ఉంటుంది. హిప్నాటిస్ట్ కోచ్‌లాగా, పరుపు ఆమెను బాల్యంలోకి తరలిస్తుంది. గుండెపోటుతో చనిపోయిన తల్లిని ఆమె ముందు ప్రత్యక్షం చేయిస్తుంది. పూర్ణ పల్లెంతా కలదిరుగుతుంది. చలికి వణికే సంక్రాంతులు, హరిదాసులు, వేకువజామున వచ్చే లాంతరు సాయిబులు, గొబ్బెమ్మలు; పూర్ణ ఒక సైకలాజికల్ ట్రాప్ లోకి వెళ్ళిపోయింది. ఇంట్లో జరిగిన అప్రియమైన విషయాలన్నీ మరిచిపోయింది (ముఖ్యంగా జయంతుడి ఆత్మహత్యా ప్రయత్నం, సుందరం హార్ట్ సర్జరీ.) క్రమంగా తనలో తాను మాట్లాడుకోవడం మొదలుపెట్టింది. పరుపు ఆమెకో ఆత్మీయ నేస్తం అయింది. కంప్లైంట్ చేస్తుంది. మారాం చేస్తుంది. అలుగుతుంది. కోపపడు తుంది. పూర్ణ పరుపుతో గడిపే సంతోష సమయాల కోసం, పగలు కూడా స్లీపింగ్ పిల్ వేసుకుంటుంది.

సుందరానికి భయం వేసింది. పరుపు క్రమంగా కాల్పనిక వక్తి అయ్యిందనిపించింది. అంతర్యామిగా మారినట్లు తోచింది. అది పెరిగి పెరిగి మహా పర్వతమై, ఇంటినీ, పూర్ణనూ ధ్వంసం చేస్తుందేమో

నని భయం వేసింది. అది క్రమంగా వాళ్ళ జీవితాలను కంట్రోలు చేసే రాజకీయశక్తిగా మారినట్లు తోచింది.

ఒక సాయంకాలం పూర్ణ గుడికి వెళ్ళిన సమయంలో, పురాతనమైన పాత దశాబ్దాల ఆ పరుపును, వీధి మధ్యలో విసిరేసి పెట్రోలు పోసి తగలబెట్టాడు.

ఆ రాత్రి పూర్ణ గొప్ప ఆపద ఎదురైనట్లుగా భీతిల్లిపోయింది. ఆత్మీయులు ఎవరో చనిపోయినట్లుగా దుఃఖపడింది. ఆ రాత్రి నుంచి పూర్ణకు నిద్ర పూర్తిగా దూరమైంది. కాస్త కునుకు పట్టగానే, ఇంటి మధ్యలో ఎవరో పొగిలిపొగిలి ఏడుస్తున్నట్లు, కన్నీటి వరద ఆమె శరీరాన్ని తడిపినట్లు, ఒక నిరంతరమైన రోదన ఇంటి మాటున తిరుగాడుతున్నట్లు, అనిపించేది.

**మూడు**

జయంతుడి అపార్టుమెంటు. ఏడో, ఎనిమిదో అంతస్తు. కిటికీ లోంచి ఆకాశంతో నేరుగా సంభాషించవచ్చు. అందులో ఒక బెడ్ రూమ్ సుందరం, పూర్ణ కోసం.

ఇప్పుడు పూర్ణ నిద్రపోదు. నిద్రలాంటి ఒక స్థితిలో గడుపుతుంది. కళ్ళు మూసుకునే ఉంటాయి. గురకలాంటి శబ్దాలు వినిపిస్తాయి. శరీరంలోని శ్వాస కూడా మందగిస్తుంది. కానీ అన్నిటినీ చూస్తుంది. అన్నిటినీ వింటుంది. సమస్తాన్ని కళ్ళలో దాచి, నిద్రను నటిస్తుంది.

ఉదయం నాలుగుగంటలకే లేస్తుంది పూర్ణ. కాఫీ చేసుకొని, బయట వరండాలో నిలబడి, ఆకాశం వైపు చూస్తుంది. మేఘాలు నిప్పంటించుకొని తగలబడుతున్నట్లుగా ఉంటుంది.

వంటగదిలో, వేడి స్టవ్ ఎదురుగా నిలబడి, చెమటలు కక్కుతూ; నిత్యం తగలబడుతున్న కొలిమిలా ఉంటుంది ఆ గది. జయంతుడికి, అతని భార్యకు, ఏడేళ్ళ మనవడికి ఏడుగంటలకే వంట చెయ్యాలి.

పూర్ణకు వంటగదిలో ఏ మూలకు వెళ్ళినా, చనిపోయిన ఎలుక వాసన వస్తున్నట్లుగా ఉంటుంది. పూర్ణ శరీరం నుంచి కూడా చచ్చిన ఎలుక వాసన. అపార్ట్‌మెంటుకు వచ్చిన కొత్తలో ఏ గదిలో చూసినా ఎలుకలే. వందలకొద్దీ ఎలుకల్ని చంపి ఉంటుంది పూర్ణ. 'రాట్ కిల్లర్' అని ఆమెను పిలుస్తుంటాడు మనవడు. ఇప్పటికీ ఎలుకలు కీచుగొంతుతో ఏడుస్తున్న చప్పుడు వినిపిస్తుందా వంట గదిలో. ఉదయాన్నే గుమ్మం ముందు రక్తసిక్తమై నిర్జీవంగా పడివున్న ఎలుకలు కనిపిస్తాయి పూర్ణకు. ఆ అపార్ట్‌మెంటును చాలాయేళ్ళు నీళ్ళలో నాన్చి పైకి తీసినట్లుగా, తడి వాసన, పాచి వాసన వేస్తుంది. పూర్ణకి తన శరీరం నుంచి కూడా వాసనలు వస్తున్నట్లు అనిపిస్తుంది. పూర్ణ శరీరం నుంచి, వేసుకొనే బట్టల నుంచి, పడుకొనేచోటు నుంచి వస్తుందా వాసన. స్పష్టంగా వివరించలేని వాసన. మాంసాన్ని ఉడక బెడుతున్నప్పుడు వచ్చే వాసన. లేదా నిద్రలేక, మెదడు వేడెక్కి కుతకుతలాడుతున్న వాసన.

సుందరం రిటైర్ అయ్యాడు. కొద్దిగా పింఛను వస్తుంది. పూర్ణనడిగి ఎప్పుడయినా కాస్త విస్కీ పుచ్చుకుంటాడు. అదీ పగటి పూట. (జయంతుడు ఇంట్లో లేనప్పుడు.) ఆ కాసేపు సుందరం మనోహరంగా పరిమళిస్తుంటాడు. పూర్ణను దగ్గర కూర్చోబెట్టుకొని; అట్లాంటి సమయాల్లో పూర్ణ కూడా పరిమళభరితంగా మారుతుంది. రంగురంగుల బాల్యపు కలల వాసన వాళ్ళ దగ్గర వేస్తుంది. పూర్ణ గాఢంగా ఊపిరి తీసుకొని, మెదడులోపల తొక్కి వేయబడ్డ జ్ఞాపకం లోకి ప్రయాణించి, వాళ్ళ అమ్మ వంటగదిలో ఉన్నప్పుడు వేసే సువా సనలు, చల్ల చిలికేటప్పటి వెన్న వాసనలు, తెల్లతెల్లటి అన్నపు వాసన, వాళ్ళ నాన్న దగ్గర వేసే పొలం వాసన. ముఖ్యంగా వరిమళ్ళ మీద నుంచి వచ్చే వాసన (పచ్చివాసన, తేమ వాసన), ఆయన కండువాలో చుట్టుకు వచ్చే పచ్చి వేరుసెనక్కాయలు, వాటిలోంచి గుప్పుమనే మట్టివాసనలు; పూర్ణ, సుందరం ఒకరికొకరు హత్తుకు పోయి, ఆ

పరిమళాల మత్తులో, ఒక్కొక్క జ్ఞాపకం గంటల తరబడి చెప్పు కుంటూ, గడుపుతారు.

రాత్రి పదకొండు గంటల తరువాత, పూర్ణ వంటగదినంతా సర్ది, అంట్లు తోమి, శరీరం అలిసిపోయి, విశ్రాంతి కోరుకోగా, తమ గదిలోకి వెళ్తుంది. గది మధ్యలో రబ్బరు వాసన వేసే పరుపు. దానిపై పడుకుంటే శరీరానికి నిప్పు పెట్టినట్లుగా ఉంటుంది. నేలపై దుప్పటి పరచుకొని పడుకుంటారు వాళ్ళు. సుందరం త్వరగానే నిద్రపోతాడు (మందుల ఎఫెక్టు). పూర్ణ, ఎప్పటిలాగే నిద్రలాంటి స్థితిలో.

రాత్రి, పన్నెండు గంటల సమయంలో, తుళ్ళిపడుతున్న నవ్వుల సందడి వినిపిస్తుంది. పక్కనున్న అపార్ట్‌మెంటు నుంచి; ముఖ్యంగా ఆడమనిషి నవ్వు. మువ్వలు ఘల్లుమని మోగినట్లుగా ఉంటుందా నవ్వు. ఆ నవ్వు పూర్ణకెంతో యిష్టం. బాల్యపు నవ్వులు, కేరింతలు గుర్తుకు వస్తాయి. ఆ ఆడమనిషిని చూస్తే బాగుండు అని ఎన్నోసార్లు అనుకునేది పూర్ణ. రాత్రంతా ఆ నవ్వులు అట్లా గల గలమంటూనే ఉంటాయి. ఆ ఆడమనిషి, నవ్వులు, కబుర్లు, అవి పూర్ణను జోకొట్టినట్లు అనిపించి, పిసరంత కునుకు పడుతుంది.

ఉదయం నాలుగు గంటలకు, వేకువ పక్షులు అరుస్తూ ఉంటాయి. వంటగదిలోంచి ఎలుకల చప్పుడు. అప్రియమైన ఇంటి వాసన. ఇల్లు, పూర్ణతో గుసగుసలాడుతున్నట్లుగా ఉంటుంది. కానివ్వు, పని మొదలుపెట్టు, అని ఆజ్ఞలు ఇస్తుంది. మధ్యాహ్నానికి, పనులన్నీ అయిపోయి, ఇల్లు నిశ్శబ్దంగా మారుతుంది. ఇల్లు అలిసి పోయి నిద్రపోతుంది అనేది పూర్ణ. సుందరాన్ని టి.వి. కూడా పెట్ట నియ్యదు.

పక్క అపార్టుమెంటులో (రెండోదో, మూడోదో), ఎవరో ఆడ మనిషి చనిపోయిందని కబురు తెచ్చాడు సుందరం. ఆత్మహత్య చేసుకుందని చెప్పాడు. పూర్ణ ఆ మధ్యాహ్నం ఆ అపార్టుమెంటుకు వెళ్ళింది. నేలపై పడుకోబెట్టారు ఆ అమ్మాయిని. చందమామలాంటి ముఖం. అమాయకంగా ఉందా ముఖం. తనకు రోజూ రాత్రుళ్ళు

వినబడే మధురమైన నవ్వులు, ఈ అమ్మాయివే అనిపించింది. పూర్ణకు దిగులు వేసింది. కళ్ళలో నీళ్ళు తిరిగాయి. ఎందుకో అక్కడ కూర్చుని, ఆ అమ్మాయి కోసం ఏడవాలనిపించింది. ఆ అమ్మాయి పక్కనే కూలబడి, పైటచెంగును నోట్లో కుక్కుకొని, తట్టుకోలేని దుఃఖం తోసుకువచ్చింది పూర్ణకు. అక్కడున్న వాళ్ళందరూ ఆశ్చర్యం గా చూస్తున్నారు. "ఈ ముసలమ్మకేమయింది. అట్లా ఏడుస్తుంది," అని గుసగుసలాడుకున్నారు. పూర్ణకు అక్కడ నుంచి వెళ్ళాలనిపించ లేదు. అక్కడే గోడకానుకొని కూలబడింది. శవాన్ని కదిలించే వరకూ అక్కడే కూర్చుంది.

తమ అపార్టుమెంటుకొచ్చేసరికి, ఇంటి మధ్య జయంతుడు, అతని భార్య టీవీలో సినిమా చూస్తూ పెద్దపెద్దగా నవ్వుకుంటున్నారు. సుందరం ఆమె కోసం ఎదురుచూస్తున్నాడు. "ఎక్కడికెళ్ళావు? ఇంకా వంట మొదలుపెట్టలేదు. పిల్లలు అన్నం తినే టైమ్ అయ్యింది," అని అరిచాడు. పూర్ణ, విననట్లే తన గదిలోకి వెళ్ళింది. గది మధ్యలో కొంగు పరచుకొని పడుకొంది. గట్టిగా కళ్ళు మూసుకొని; కళ్ళనిండా ఆ చనిపోయిన అమ్మాయి రూపమే. పూర్ణకు దుఃఖం వేసింది. ఎవరైనా ఓదార్చితే బాగుండు అనిపించింది. ఆమె ప్రమేయం లేకుండానే కళ్ళ నిండా ధారలుగా కన్నీళ్ళు. జయంతుడు అరుస్తున్నాడు- "ఏం చేస్తుంది అమ్మ. ఇంకా వంట మొదలుపెట్టలేదు," అని. పూర్ణకు, తన చెవులకు మూతలు పెట్టుకొని, ఏ శబ్దమూ లోపలికి రాకుండా ఆపాలని.

దుఃఖించి, దుఃఖించి, అట్లాగే ఒక నిద్రలోకి వెళ్ళిపోయింది పూర్ణ. గాఢమైన నిద్ర. ఎన్నో ఏళ్ళ తరువాత, కళ్ళు మూతలు పడి, మత్తు ఏదో కమ్మినట్లుగా, శరీరమంతా తేలికయి;

ఆ మరుసటి ఉదయం, ఎంత లేపినా, నిద్ర లేవలేదు పూర్ణ.

*నవ్య వీక్లీ, 3 ఆగస్టు 2011*